క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

కందుకూరు: ప్రస్తుత పాలకమండలి మండల పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించనున్నారు. ఉదయం 11గంటలకు సమావేశ మందిరంలో ఎంపీపీ మంద జ్యోతి అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరవ్వాలని ఎంపీడీఓ సరిత కోరారు. ఎన్నికలు నిర్వహించే వరకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులు పాలన కొనసాగిస్తారని సమాచారం. ఈ నెల 4 ప్రస్తుత బాడి పదవీకాలం ముగియనుంది.

బీఆర్ఎస్ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడిగా రాజు



నియామకపత్రం అందజేస్తున్న సబితారెడ్డి

బడంగ్‌పేట్: భారత రాష్ట్ర సమితి మీర్‌పేట్ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడిగా నందిహిల్స్ ప్రాంతానికి చెందిన సింగం రాజు పటేల్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు పటేల్ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే, పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకులు, కాలనీవాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మ పేరిట మొక్క నాటండి

మంచాల: ప్రధాని నరేంద్రమోదీ పునఃప్రారంభించిన మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ శ్రేణులు వీక్షించారు. ఈ సందర్భంగా మోదీ తన సందేశంలో ప్రతీ ఒక్కరు అమ్మ పేరిట ఒక మొక్క నాటండని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గోడిరెడ్డి లచ్చిరెడ్డి, రాష్ట్ర నాయకుడు వింజమూరి వెంకట్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పాండాల జంగయ్య గౌడ్, నాయకులు రాజేందర్‌రెడ్డి, నారెడ్డి నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

దేవస్థానం బాధ్యతలు అప్పగింత

వనస్థలిపురం: వనస్థలిపురం ఫేజ్–1లోని శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి దేవస్థానం బాధ్యతలను ఆదివారం నుంచి వీరశైవ లింగాయత్ సమాజం పూర్వ పాలకమండలి స్వీకరించింది. 2014 నుంచి 2024 జూన్ వరకు దేవస్థానం కమిటీ అధ్యక్షుడిగా ఉన్న మఠం శాంత్‌కుమార్ తన పదవీ కాలం ముగియడంతో బాధ్యతలను సమాజం పూర్వ కమిటీకి అప్పగించారు. పూర్వ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు శాంతప్ప, రవీంద్రనాథ్ ఆదివారం నుంచి దేవస్థానం బాధ్యతలను స్వీకరించారు. త్వరలోనే దేవస్థానానికి సంబంధించి నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు వారు తెలిపారు. వీర శైవ లింగాయత్ సమాజం ప్రతినిధులు దీపావళి శ్రవణ్‌కుమార్, చౌదరి దివాకర్ లింగం, వీరప్ప, శ్రీశైలం పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

ఇబ్రహీంపట్నం రూరల్: జనావాసాల్లో ఏర్పాటు చేసిన మినీ ట్రాన్స్‌ఫార్మర్లతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని జనం జంకుతున్నారు. మండల పరిధిలోని పోచారం గ్రామంలో ఎల్మినేడు వెళ్లే దారిలో రోడ్డు పక్కనే మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. వర్షాకాలం.. రోడ్డు పక్కనే చేతికి అందే ఎత్తులోనే ఉండడంతో విద్యుదాఘాతంతో ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. విద్యుత్ సిబ్బంది సకాలంలో స్పందించి ప్రమాదం జరగకముందే వాటికి రక్షణ కంచె ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. వీలైతే వాటి స్థానాలను మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రుణమాఫీ నిర్ణయంపై రైతుల హర్షం

పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి

యాచారం: పంట రుణమాఫీపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో రైతుల్లో హర్షం వ్యక్తమవుతోందని పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో రైతు భరోసా పథకంపై రైతుల సలహాలు, సూచనలు స్వీకరించారు. ఏక కాలంలో రుణమాఫీ చేస్తే బాగుంటుందని.. రైతు భరోసా నిధులు సాధ్యమైనంత త్వరగా ఖాతాల్లో జమ చేస్తే వానాకాలం పెట్టుబడులకు ఉపయోగించుకుంటామని తెలిపారు. రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతుల విజ్ఞప్తిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ఎల్‌బీనగర్: ఉచిత కంటి పరీక్ష శిబిరం హరిహరపురం కాలనీలో ఏర్పాటు చేయడం సంతోషకరమని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఆదివారం బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని హరిహరపురం కాలనీలో శ్రీసాయినేత్రాలయ కంటి ఆసుపత్రి ఎండీ డాక్టర్ సంతోష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరానికి కార్పొరేటర్ లచ్చిరెడ్డి హాజరయ్యారు.

‘విస్తరణ’ ఆలస్యం

నిధులు మంజూరైనా జాప్యం
- నత్తనడకన రోడ్డు వెడల్పు పనులు



గాంధీచౌక్ వద్ద రోడ్డు విస్తరణ కోసం తవ్విన రోడ్డు మార్కింగ్ ఇచ్చి పనులు మరిచారు

ఆమనగల్లు: పట్టణంలో రాజీవ్ చౌరస్తా నుంచి మాడ్గుల రోడ్డులో సందబావి వరకు రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరైనా పనులు సాగడం లేదు. విస్తరణ పనులకు మార్కింగ్ చేశారే తప్ప ఒక్క అడుగు ముందుకు పడడం లేదు. ప్రజలు సిద్ధంగా అధికారుల నుంచి స్పందన కరువైంది. వాహనాల రాకపోకలకు దశాబ్దాల నుంచి ఇబ్బంది పడుతున్న ప్రజల సమస్య పరిష్కారానికి ఎదురుచూపులే మిగులుతున్నాయి.

రూ.37 కోట్లు మంజూరు

ఆమనగల్లు నుంచి తలకొండపల్లి మండల కేంద్రం వరకు రోడ్డు విస్తరణ, ఆధునీకీకరణ పనులకు సీఆర్ఎఫ్ క్రింద 2021లో రూ.37కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో తలకొండపల్లి మండల కేంద్రంలో రోడ్డు విస్తరణతో పాటుగా ఆమనగల్లు వరకు రోడ్డు ఆధునీకీకరణ, ఆమనగల్లు సమీపంలోని కాల్వపై బ్రిడ్జి వెడల్పు, షాద్‌నగర్ రోడ్డు నుంచి రాజీవ్ చౌరస్తా మీదుగా సందబావి వరకు రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. దాదాపు రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించి తలకొండపల్లిలో రోడ్డు విస్తరణ, ఆమనగల్లు వరకు రోడ్డు ఆధునీకీకరణ పనులను పూర్తి చేశారు. ఆమనగల్లు సుర సముద్రం చెరువు అలుగు కాల్వపై బ్రిడ్జి వెడల్పు పనులు చివరి దశలో ఉన్నాయి. రాజీవ్ చౌరస్తా నుంచి బ్రిడ్జి వరకు రోడ్డు విస్తరణ పనులు దాదాపు పూర్తి చేశారు.

పట్టణంలో రాజీవ్ చౌరస్తా నుంచి సందబావి వరకు 66 ఫీట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సి ఉంది. రోడ్డు నిర్మాణంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న నివాసాలను దాదాపు సగం కూల్చివేయాల్సి ఉంటుంది. దీంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వారంతా రోడ్డు విస్తరణను 66 ఫీట్లు కాకుండా 50 ఫీట్లకు కుదించాలని కోరారు. ఇందుకు ఆమనగల్లు మున్సిపల్ పాలకవర్గం సైతం తీర్మాణం చేసి ఆర్‌అండ్‌బీ అధికారులను 50 ఫీట్ల రోడ్డు వెడల్పు చేయాలని కోరారు. 50 ఫీట్లకు విస్తరిస్తూ రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లకు మార్కింగ్ ఇచ్చారు. కొందరు స్వచ్ఛందంగా కూల్చివేశారు.

చిరు వ్యాపారుల సహకారం

స్థానిక రాజీవ్ చౌరస్తా నుంచి గాంధిచౌక్ వరకు బాలుర ఉన్నత పాఠశాలను ఆనుకుని చిరు వ్యాపారస్తులను తొలగించి వేయించారు. ఇందుకు వ్యాపారులు సైతం సహకరించారు. రెండు వారాల క్రితం రోడ్డు విస్తరణ పనుల కోసం రోడ్డును తవ్వి వదిలేశారు. రోడ్డు విస్తరణ పనులకు ప్రజలంతా స్వచ్ఛందంగా సహకరిస్తున్నా అధికారులు రోడ్డు పనులు మాత్రం చేపట్టడం లేదు. వెంటనే రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించి ప్రజల ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

త్వరలో పూర్తి చేస్తాం

పట్టణంలో రోడ్డు విస్తరణ పనులను త్వరలోనే పూర్తి చేస్తాం. ఇప్పటికే రాజీవ్ చౌరస్తా సమీపంలో మట్టి తవ్వే పనులు పూర్తయ్యాయి. అదనపు నిధులకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కావడంతో పనులు ప్రారంభించాం.

– రవితేజ, ఏఈ, ఆర్‌అండ్‌బీ శాఖ , ఆమనగల్లు



ధాత్రిదేవిని సన్మానిస్తున్న బాలాపూర్ సహకార సంఘం సభ్యులు

‘రైతు భరోసా’కోసం ప్రణాళికలు

సహకార సంఘం జిల్లా అధికారిణి ధాత్రిదేవి

బడంగ్‌పేట్: రైతు భరోసాపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేసి రైతులకు పెట్టుబడి సాయం అందిచేందుకు ప్రణాళికలు రచిస్తోందని సహకార సంఘం జిల్లా అధికారిణి ధాత్రిదేవి అన్నారు. ఆదివారం బాలాపూర్‌లోని బండ్లగూడ ఖల్సా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జిల్లా అధికారులు రైతుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. పెట్టుబడి సాయం కాకుండా విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సామగ్రిపై సబ్సిడీ ఇవ్వాలని కొందరు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఐదు లేదా పది ఎకరాలకే పథకాన్ని పరిమితం చేయాలని పలువురు వెల్లడించారు. సాగు చేసేవారికిస్తేనే మేలు జరుగుతుందని మరికొందరు అభిప్రాయపడ్డారు. అందరి అభిప్రాయాలను జిల్లా సహకార సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని ధాత్రిదేవి తెలిపారు. అనంతరం ఆమెను బాలాపూర్ ఖల్సా పాలకవర్గం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాలాపూర్ సహకార సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి పెంటారెడ్డి, వైస్ చైర్మన్ కొలన్ తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు క్లైం నిరంజన్‌రెడ్డి, క్లైం లక్ష్మారెడ్డి, కొంతం అరుణారెడ్డి, నిరుడి నర్సమ్మ, రావుల లింగం, కొంతం సంపత్‌రెడ్డి, మేకల మహేందర్, ఇబ్రాం బాలయ్య, పన్నాల గోపాల్‌రెడ్డి, ఎన్ను శ్రీనివాస్ రెడ్డి, సీఈఓ ఎర్ర జైహింద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సేవా సంఘం కార్యకవర్గం ఏకగ్రీవం

బడంగ్‌పేట్: బ్రాహ్మణ సేవా సంఘం మున్సిపల్ కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా రాఘవరావు, ప్రధాన కార్యదర్శిగా బోర్పట్ల విరాట్ స్వరూపాచార్య, కోశాధికారిగా బళ్లమూడి రాంబాబు, ఉపాధ్యక్షులుగా మంత్రాల శ్రీరామమూర్తి, బీఎల్ నవీన్‌కుమార్, సహాయ కార్యదర్శిగా వింజమూరి మధుసూధన్‌రావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా నూకల సతీశ్ కుమార్, ఉపాధ్యక్షురాలిగా వేముల కవిత, సహాయ కార్యదర్శులుగా నందూరి ప్రకాశ్, ఇంగువ కిరణ్, ప్రచార కార్యదర్శి వేముల రవికుమార్, సాంస్కృతిక కార్యదర్శిగా పాట్లూరి విజయలక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాసరావు, ఉమాశంకర్‌రావు, మాధవరావు, నరేందర్, మాధురి, మైథిలి, శారద, బద్రీనాథ్, కార్తీక్, జగన్నాథ్ తదితరులను ఎన్నుకున్నారు.

రైతుల ఆర్థిక ప్రగతే లక్ష్యం

మదర్ డెయిరీ కుర్మిద్ద చైర్మన్ మహేందర్‌రెడ్డి



మహేందర్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న మదర్ డెయిరీ మేనేజర్ కరుణాకర్‌రెడ్డి

యాచారం: నల్గొండ–రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘం గ్రామ పాలకవర్గం సమావేశం కుర్మిద్దలో ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశానికి మేనేజర్ కరుణాకర్‌రెడ్డి హాజరయ్యారు. అనంతరం కుర్మిద్ద పాలకవర్గం కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా మహేందర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులుగా శ్రీనివాస్ యాదవ్, భాగ్యమ్మ, మంగమ్మ, అంజయ్య, సంజీవ, నర్సింహారెడ్డి, జగన్, నర్సింహ, జంగయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదేళ్లుగా చైర్మన్‌గా ఎన్నుకుంటున్నందుకు రైతులకు ధన్యావాదాలు తెలిపారు. రైతుల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా సంఘం పని చేస్తుందన్నారు.

ఫ్లైఓవర్‌ను మాత్రమే నిర్మించాలి



మాట్లాడుతున్న బీఆర్ఎస్ కార్పొరేటర్లు

వనస్థలిపురం: వనస్థలిపురం పనామా చౌరస్తా వద్ద ప్రజలకు ఇబ్బందులు కలిగించే అండర్‌పాస్ (మట్టి బ్రిడ్జి) నిర్మాణం వద్దని, ఫ్లైఓవర్‌ను మాత్రమే నిర్మించాలని బీఆర్ఎస్ మాజీ కార్పొరేటర్లు జిట్టా రాజశేఖర్‌రెడ్డి, సామ తిరుమల్‌రెడ్డి, కొప్పుల విఠల్‌రెడ్డి, జిన్నారం విఠల్‌రెడ్డి జీ.వీ.సాగర్ రెడ్డి అన్నారు. ఆదివారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో వారు మాట్లాడారు. విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు తమకు సమ్మతమే కానీ, పనామా వద్ద అండర్‌పాస్ నిర్మాణం వల్ల రెండు వైపులా గోడలు వచ్చి అటు, ఇటు ఉన్న వ్యాపార సముదాయాలు మూసుకుపోతాయని అన్నారు. వనస్థలిపురం అనుసంధానంగా వందలాది కాలనీలు ఉన్నాయని, అండర్‌పాస్ నిర్మాణంతో కాలనీలకు వెళ్లడానికి యూటర్న్ సమస్యలు వస్తాయని అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వమే ఉన్నా ఈ విషయంలో స్థానిక బీజేపీ కార్పొరేటర్లు పనులను అడ్డుకోలేకపోతున్నారని వారు అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నగరంలో అందమైన ఫ్లైఓవర్లు నిర్మాణం జరుపుకున్నాయని, ఇక్కడ ఫ్లైఓవర్‌ను నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. లేనట్లయితే పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామన్నారు.



మంచాల రోడ్డులో నిలిచిన వాహనాలు

‘ట్రా’ఫికర్

అడ్డగోలు పార్కింగ్‌తో అవస్థలు

ఇబ్రహీంపట్నం: అడ్డగోలు పార్కింగ్‌లతో ఏర్పడుతున్న ట్రాఫిక్ అంతరాయంతో ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. ఇబ్రహీంపట్నంలోని మంచాల రోడ్డులో ట్రాఫిక్ ఇక్కట్లతో జనం విసుగెత్తి పోతున్నారు. రోడ్లకు ఇరువైపులా ఇష్టానుసారంగా వాహనాలు పార్కింగ్ చేయడంతో ఈ సమస్య మరింత జఠిలమవుతోంది. ఆదివారం ఏర్పడిన ట్రాఫిక్‌తో పలు వాహనాలు రోడ్లపైనే గంటల తరబడి నిలిచిపోయాయి. ఈ మార్గంలో షాపింగ్ కాంప్లెక్స్‌లు పార్కింగ్ సదుపాయం కల్పించకపోవడంతో రోడ్లపైనే వాహనాలు నిలుపుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు పట్టించుకోకపోవడంతో వాహనదారులే ట్రాఫిక్ క్లియర్ చేసుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



ఇంజాపూర్‌లో రోడ్డు పక్కన వేసిన చెత్త

చెత్త తీయరూ!

మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల పక్కన ఎక్కడ పడితే అక్కడ చెత్త వేస్తుండడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. చెత్త సేకరణకు స్వచ్ఛ ఆటోలు తిరుగుతున్నా కొందరు బహిరంగ ప్రదేశాల్లోనే పడేస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం, చెత్త వేసే వారిపై చర్యలు తీసుకోకపోవడంతో రోడ్లన్నీ డంపింగ్ యార్డులుగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - తుర్కయంజాల్

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం



హరీశ్‌రావును సన్మానిస్తున్న జెడ్పీటీసీ తదితరులు

- నియోజకవర్గంలో బీఆర్ఎస్‌ను బలోపేతం చేస్తాం
- జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్

తలకొండపల్లి: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ అన్నారు. ఆదివారం ఆయన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావును హైదరాబాద్‌లోని నివాసంలో పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అనంతరం కల్వకుర్తి నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితిని హరీశ్‌రావు అడిగి తెలుసుకున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అధిక స్థానాలు గెలిచేందుకు కృషి చేయాలని సూచించారు. పార్టీకి పూర్వవైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామన్నారు.

ఎమ్మెల్యేను కలిసి వారిలో ఎంపీపీ తిర్మణి నిర్మలా శ్రీశైలంగౌడ్, కొమ్ము శ్రీనివాస్‌యాదవ్, బుచ్చిబాబు, కోటేశ్, నరేశ్‌గౌడ్, శ్రీశైలంగౌడ్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

‘గ్యారంటీ’ల గందరగోళం

- ‘ఆరు’ పథకాల కోసం జనం ఎదురుచూపులు
- కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు



ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న అధికారులు(ఫైల్)

ఇబ్రహీంపట్నం: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీల పేరిట ప్రజల్లోకి వెళ్లి ప్రచారం చేపట్టింది. తదనంతరం అధికారాన్ని హస్తగతం చేసుకున్న కాంగ్రెస్ ప్రజాపాలన పేరిట దరఖాస్తులు స్వీకరించింది.

జనవరి 6 వరకు తీసుకున్న దరఖాస్తులను ఆన్‌లైన్ చేశారు. కాగా దరఖాస్తుదారుల్లో కొందరికే ప్రస్తుతం ఇస్తున్న గృహజ్యోతితో 200 యూనిట్ల వరకు జీరో బిల్లు, మహాలక్ష్మి పథకంలోని రూ.500 వంట గ్యాస్ పథకం అందుతోంది. ఈ లోగా పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన రావడంతో కోడ్ అమలులోకి ఆయా పథకాలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. కోడ్ ముగిసిన వెంటనే కచ్చితంగా అమలవుతుందని మంత్రులు, నేతలు ఎన్నిల సభల్లో హామీలు గుప్పించారు. జూన్ 6న కోడ్ ముగిసినా ప్రభుత్వం నుంచి స్పష్టమైన ప్రకటనేదీ రాకపోవడంతో తమకు పథకాలు అందుతాయో లేదోనని పేద, మధ్యతరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో ప్రజా పాలన ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి గతంలో చేసిన దరఖాస్తులను పరిశీలిస్తున్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలో 325 మంది, మున్సిపాలిటీ 300 మందికి పైగా దరఖాస్తులు చేశారు. గతంలో ఆన్‌లైన్ దరఖాస్తుల్లో పొరపాట్లను సరిచేసేందుకు వెసులుబాటు కల్పించారు. కొత్త దరఖాస్తులకు ప్రస్తుతం ఎటువంటి ఆప్షన్ ఇవ్వలేదు. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలు ఎప్పుడు చేస్తారో.. తమకు ఎప్పుడు అందుతాయోనని ప్రజలు నిరీక్షిస్తున్నారు.

‘జీరో’ బిల్లు కోసం



తమకు సొంతిల్లు లేక అద్దె ఇంట్లోనే ఉంటున్నాం.. ప్రజాపాలనలో ఉచిత విద్యుత్‌కు దరఖాస్తు చేసుకోలేదు. కిరాయి దారులకు సైతం జీరో బిల్లుకు అర్హులని.. ఉచిత విద్యుత్‌కు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చా.

- శ్రవంతి, ఇబ్రహీంపట్నం

పథకాలు అందించాలి



ఉచిత కరెంట్ బిల్లులు రావడం లేదు. కొంతమందికే వచ్చాయి. ఎక్కడ పొరపాటు జరిగిందో తెలుసుకుని తిరిగి దరఖాస్తు చేస్తున్నా. పేద కుటుంబానికి చెందిన తమకు ప్రభుత్వం పథకాలు అందేలా చూడాలి.

- గౌస్, ఇబ్రహీంపట్నం

అ‘పూర్వ’ సమ్మేళనం

యాచారం: మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన రెండు బ్యాచ్‌ల పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. 1990–91, 2008–09 సంవత్సంలో పదో తరగతి పూర్తి చేసుకున్న వీరు వేర్వేరు ఫంక్షన్ హాల్స్‌లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వారి చిన్ననాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.



మాల్‌లో సమావేశమైన 2008-09 బ్యాచ్ విద్యార్థులు

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
బి. కిరణ్‌కుమార్
9912220386